రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 14వ తేదీ వరకు కిస్మత్‌పూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం ధ్రువీకరణ పత్రం, ఆహార భద్రత కార్డు, వికలాంగులకు వికలాంగుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత, ఏదైనా ట్రైనింగ్ పొందిన ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల అరెస్ట్



ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శంషాబాద్: గచ్చిబౌలి హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంపై నిరసన వ్యక్తం చేసేందుకు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను ఆర్‌జీఐఏ పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు నీరటి మల్లేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై ప్రణయ్ మాట్లాడుతున్న యూనివర్సిటీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

ఖాళీ స్థలాలు.. చిట్టడవులా..?

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలకు కొత్త సమస్య తలెత్తుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్లపొదలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఖాళీ స్థలాలకు కొదువ లేదు. ఈ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌లో ఉన్న ఖాళీ స్థలాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేటు స్థలాల యజమానులు వారి స్థలాలను పట్టించుకోవడం లేదు. నగరంలోని చాలా మంది రాజేంద్రనగర్ శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ ప్లాట్లను కొనుగోలు చేసి వదిలేశారు. ప్రస్తుతం అవి పాములు, పందులు, దోమలు ఆవాసంగా మారాయి. ఈ స్థలాల్లో మురుగు చేరడంతో స్థానికులు దుర్వాసనను భరించలేకపోతున్నారు. అంతేకాకుండా పిచ్చి మొక్కల కారణంగా ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చిన్నారులను బయటకు పంపాలంటేనే భయాందోళన తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు కాలనీల సంక్షేమ సంఘాలు ప్లాట్ల యజమానులకు శుభ్రం చేసుకోవాలని సూచించాయి. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు కోరుతున్నారు.



ఓ కాలనీలో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు



నీటిని తోడుతున్న ట్యాంకర్లు

నీటిని తోడేస్తున్నారు..

2 వేల అడుగుల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

- యథేచ్ఛగా అక్రమ నీటి వ్యాపారం
- వాల్టా చట్టానికి తూట్లు.. చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

గచ్చిబౌలి: నీటి అక్రమ వ్యాపారంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఐటీ కారిడార్‌లో 1500 నుంచి 2 వేల అడుగుల లోతు బోర్లు వేసి నిత్యం నీటిని తోడేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నారు. ఐటీ కారిడార్‌లోని గౌలిదొడ్డిలో నిత్యం వందలాది ట్యాంకర్లు అపార్ట్‌మెంట్లు, ఐటీ కంపెనీలకు నీటిని సరఫరా చేస్తున్నాయి.

గౌలిదొడ్డితో పాటు, ఖాజాగూడ, కొత్తగూడ జంక్షన్, మాదాపూర్ సున్నం చెరువు, శిల్పారామం ఎదురుగా తుమ్మిడికుంట, కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ వెనక భాగంలో, శిల్పా గార్డెన్‌లో ఇళ్ల మధ్య నీటి వ్యాపారం జోరుగా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ వ్యాపారాన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. 20 వేల లీటర్ల ట్యాంకర్‌ను రూ.2,500, 10 వేల ట్యాంకర్‌ను రూ.1500, వెయ్యి లీటర్ల ట్యాంకర్ రూ. వెయ్యికి విక్రయిస్తున్నారు.

వాల్టా చట్టం ఏం చెబుతోంది..

నీరు, భూమి, చెట్టు కోసం చేసిన వాల్టా చట్టంలో బోరు వేసినా, బావి తవ్వినా స్థానిక తహసీల్దార్ అనుమతి తప్పక తీసుకోవాలి. అనుమతి లేకుండా బోర్లు వేస్తే తరువాత రెవెన్యూ ఆఫీస్‌లో నమోదు చేసుకోవాలి. అనుమతి లేకుండా వేసిన బోర్లు భూగర్భ జలాలు అడుగంటే విధంగా ఉంటే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవచ్చు. కానీ కొందరు వాల్టా చట్టానికి అనుగుణంగా వ్యవహరించడం లేదు.

దుర్గంధంగా నీటి నిల్వ కొలనులు

ట్యాంకర్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండే ప్రాంతంలో గుంత తవ్వి నీళ్లు ఇంకకుండా ప్లాస్టిక్ కవర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చెట్ల మధ్య వేసిన బోర్ల నుంచి మోటార్ల ద్వారా నీటిని ఈ కొలనులలోకి తరలిస్తున్నారు. అక్కడ నుంచి పెద్ద మోటార్లతో నిమిషాల్లో ట్యాంకర్ నింపి పలు కాలనీలు, అపార్టుమెంట్లు, ఐటీ కంపెనీలకు సరఫరా చేస్తున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసే ఐటీ కంపెనీలు, హోటళ్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు కేవలం వాడుకునేందుకు మాత్రం ఉపయోగిస్తున్నారు. కాగా రోజుల తరబడి నీటి కొలనులను శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ నీటితో రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తూ లక్షల రూపాయలు దండుకోవడమే లక్ష్యంగా అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు

ప్రతియేటా భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ఐటీ కారిడార్‌లో వేల అడుగుల లోతులో బోర్లు వేసి నిత్యం నీటిని తోడుతున్నారు. పెద్ద మోటార్లతో నీటిని తోడుతుండడంతో సమీప కాలనీలలో నీటి సమస్య తీవ్రమవుతోంది. గచ్చిబౌలిలోని ఏపీహెచ్‌బీ కాలనీలో ఐదేళ్ల క్రితమే ఓ వ్యక్తి తన ప్లాట్‌లో 2 వేల అడుగుల లోతులో బోరు వేస్తే చుక్క నీరు రాలేదు. పలుచోట్ల ఇళ్లకు నీరు కావాలంటే వేల అడుగుల లోతులో బోర్లు వేస్తున్నారు. కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీ, గౌతమీ ఎన్‌క్లేవ్‌లో వేసవిలో బోర్లు ఎండిపోతున్నాయి. కేవలం ట్యాంకర్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. బోర్లు ఎండిపోయిన కాలనీలు అక్రమ నీటి వ్యాపారులకు వరంగా మారుతున్నాయి.



గౌలిదొడ్డిలో పాచిపట్టిన నీటి కొలను

20న కోట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



సమావేశంలో వేద పండితులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని కోట మైసమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని 20వ తేదీన నిర్వహించేందుకు వేద పండితులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వేద పండితుడు రాజు శర్మ ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో మంగళవారం ఉదయం సమావేశమయ్యారు. శతాబ్దాల చరిత్ర కలిగిన కోట మైసమ్మ దేవాలయాన్ని గత సంవత్సరం పునర్నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 20వ తేదీన మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సత్కారం



శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న వై.శ్రీధర్ తదితరులు

రాజేంద్రనగర్: బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డిని రాజేంద్రనగర్ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా రూరల్ జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్ మంగళవారం శాలువాతో సత్కరించారు. రంగారెడ్డి జిల్లా రూరల్ మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, సీనియర్ నాయకులు యాదగిరి, వై.గోపాల్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జైభీమ్, జైరామ్ జయంత్యోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు సూర్యం, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి శ్రీనివాసు వెల్లడించారు. రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందించామన్నారు. ఈ ఏడాది అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గణేష్‌గుప్తా, డాక్టర్ అమరేందర్‌ను కలిసి మంగళవారం ఆహ్వాన పత్రాలు అందించారు.

ముగిసిన ఉగాది వసంతోత్సవాలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఉగాది వసంతోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. శ్రీనాట్యవేద కళాక్షేత్రం పరంజ్యోతి శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో విఘ్నరాజంభజే, అయిగిరి నందిని, మూషిక వాహన, గోవర్ధనగిరిధారి, వెడెలెరా వయ్యారాలు, అదిగో అల్లదిగో, జతిస్వరం, రామచంద్రయ్య, శివాష్టకం తదితర అంశాలను శివాని, నిహారిక, హరిణి, అభిరాం, నైనా, చిన్మయి, ఆశ్రిత, సహస్ర, తదితరులు పాల్గొన్నారు. శ్రీవల్లిరావు శిష్యబృందంచే కథక్ నృత్యప్రదర్శనలో గణేశవందన, గురువందన, శివవందన, తుమ్మేటి, తదితర అంశాలను కళాకారులు శివరాజ్, అక్షిత, రేఖ, హాసిని, శ్రీవల్లి, యతిక ప్రదర్శించారు.

పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా ఎన్నో పథకాలను ప్రజలకు అందజేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని సిద్ధప్పరోడ్డులోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. పేదలు సన్నబియ్యంతో భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందన్నారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు విజయలక్ష్మీ, మేకల వెంకటేష్, అజయ్, స్థానికులు మురళి తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ సిద్ధప్పరోడ్డులోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఆస్తిపన్ను వసూళ్లలో రికార్డు

- రూ.53.34 కోట్లను వసూలు చేసిన రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ
- చివరి రోజు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.3.56 కోట్లు

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ రికార్డు సృష్టించింది. చివరి రోజు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.3.56 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు రాజేంద్రనగర్ సర్కిల్‌కు రూ.54 కోట్లను ఆస్తిపన్ను వసూలు టార్గెట్‌గా విధించారు. సోమవారం అర్ధరాత్రి వరకు రూ.53.34 కోట్ల ఆస్తిపన్నును వసూలు చేసి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్ మంగళవారం మాట్లాడారు. రెవెన్యూ విభాగంలోని బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది సమష్టి కృషితో అత్యధికంగా ఆస్తిపన్ను వసూలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన టార్గెట్‌ను పూర్తి చేస్తూ దాదాపు వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేశారన్నారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులతో పాటు కాలనీలు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల సంఘం సభ్యులు తమకు పూర్తి సహకారం అందించారన్నారు.



అధికారులతో సమావేశమైన డీసీ డాక్టర్ రవికుమార్

5 శాతం రాయితీ..

ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26 సంవత్సరానికి ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ప్రకటించిందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను చెల్లించే వారికి ఈ రాయితీ లభిస్తుందన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ ఈ రాయితీ పొందవచ్చన్నారు.

పేదలందరికీ సన్నబియ్యం అందించడమే లక్ష్యం

ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్



బండ్లగూడలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్

బండ్లగూడ: రాష్ట్రంలోని పేదలందరికీ సన్నబియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్నబియ్యం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పేదలందరికీ పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారన్నారు. ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకం అన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఈ పథకాన్ని రద్దు చేయలేరన్నారు. దేశంలోనే అత్యధికంగా వడ్లను పండించిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిందన్నారు. ఈసారి యాసంగిలో కూడా అత్యధికంగా దిగుబడి వచ్చే పరిస్థితి ఉందన్నారు. రైతుల శ్రమ ఎక్కడికి పోదని ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల మేరకు రుణమాఫీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, పాండుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ షాపులలో సన్నబియ్యం సరఫరా కార్యక్రమాన్ని కాంగ్రెస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ప్రారంభించారు. మణికొండ మర్రిచెట్టు వద్ద ఉన్న రేషన్ షాపులో అర్హులైన పేదల ప్రజలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యాన్ని పేద ప్రజలకు అందించేందుకు ఎంత భారమైనా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అర్హులైన ప్రజలంతా రేషన్ షాపుల్లో అందిస్తున్న సన్నబియ్యం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కాంగ్రెస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, ముత్యాలు, బి.రాజు, కిరణ్‌కుమార్, బి.శ్రీరాములు, రవికాంత్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, మహేష్‌రెడ్డి, ఇందిరారామ్‌రెడ్డి, శివానందరెడ్డి, శ్రీనివాస్‌చారి, శ్రావణ్‌కుమార్, సావిత్రి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రామంజాపూర్‌లో..

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని రామంజాపూర్‌లో మంగళవారం ప్రారంభించారు. ముదిరాజ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ స్థానిక రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి అండ

మణికొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపేద కుటుంబానికి అండగా ఉంటుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌ముదిరాజ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవారి ఇంటికి సన్నబియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు కొత్త పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వట్టినాగులపల్లి గ్రామ అధ్యక్షుడు శివ్వాలసింగ్, నార్సింగి మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మొద్దు ధర్మపురిముదిరాజ్, మన్నే గండయ్యముదిరాజ్, రామేశ్వరం నర్సింహ, టీపీసీఎస్ చైర్మన్ తోల్కటి కృష్ణ, పెద్దపులి కిషన్, కుమ్మరి శేఖర్, మైలారం ప్రదీప్‌కుమార్, బుడాల అరుణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రామంజాపూర్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న జ్ఞానేశ్వర్



వట్టినాగులపల్లిలో ప్రారంభిస్తున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌ముదిరాజ్

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి



మైలార్‌దేవ్‌పల్లిలోని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు



రాయదుర్గం పోలీసుల అదుపులో మణికొండ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు

మణికొండ: హెచ్‌సీయూ భూములను అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని బీఆర్ఎస్ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను పరిరక్షించి వన్యప్రాణులను కాపాడాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములను అప్పగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, నాయకులను హౌస్ అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందన్నారు.

హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే పోరాటం

మైలార్‌దేవ్‌పల్లి: యూనివర్సిటీ స్థలాలను వేల కోట్లకు అమ్ముకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హెచ్‌సీయూ భూములను చదును చేయకుండా అడ్డుకుంటామని బీజేపీ పిలుపు మేరకు మంగళవారం ఆయనను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులు, వృక్ష సంపద కలిగిన అందమైన ప్రాంతాన్ని జేసీబీలతో చుట్టుముట్టి అడవిని నామరూపాలు లేకుండా చేస్తున్నారన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పెద్ద ఎత్తున తప్పకుండా అడ్డుకుంటామని అన్నారు.

మణికొండ బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ బీజేపీ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకల్ల నరేందర్‌రెడ్డి, జే.సిద్ధప్ప, మూల అనిల్‌గౌడ్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే పక్షులు, జంతువులు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.